43.

# సంకల్పముల ఫలితమే మానవ జీవితము

ప్రేమస్వరూపులారా!

మానవుని అభ్యుదయమునకు మానసిక శక్తి, చిత్తశుద్ధి అత్యవసరం. మానసిక శక్తి, చిత్తశుద్ధియే మానవత్వాన్ని దివ్యత్వముగా మార్చగలుగుతుంది. మానవునకు మనస్సే మూలాధారం. మనస్సునకు సంకల్పములే ఆధారము. సంకల్పములయొక్క ప్రభావము చేతనే మానవుడు తన పనులు తను మంచిగనో, చెడ్డగనో మార్చుకో గలుగుతున్నాడు. సంకల్పము యొక్క ప్రభావము మనస్సుపైన పడినప్పుడే మనిషియందున్న సర్వేంద్రియములు ఆ సంకల్ప ప్రభావమునే అనుసరిస్తుంటాయి. మానవుని జీవితము సంకల్పముల యొక్క ఫలితమే. ఒక చిన్నరాయిని మనము ఒక కొలనులో వేసినప్పుడు ఆ కొలనులో అలలు ప్రారంభ మవుతాయి. ఆ తరంగములు మనకు కనిపించినను, కనిపించకపోయినను ఆ కొలను యొక్క రూపాన్ని సర్వత్రా వ్యాపించి పోతుంది. అదేవిధముగా మానవుని సంకల్పమనే రాయి మానస సరోవరములో పడినప్పుడు ఆ మానస సరోవరము యొక్క అలలు సర్వత్ర వ్యాపించిపోతాయి. అలాగే తరంగములు మంచి నోటియందు ప్రవేశించినప్పుడు సద్వాక్యములు ఉచ్చరిస్తాడు. లేక ఆ సంకల్పములు చెడ్డవే అయినప్పుడు విపరీతమైన చెడువాక్కులను ఉచ్చరిస్తాడు. కర్ణ రంధ్రములలో ప్రవేశించి నప్పుడు దుశ్శబ్దమునో లేక సుశబ్దమునో అనుభవిస్తాడు. నేత్రములందు ప్రవేశించినప్పుడు సుదృష్టియో, కుదృష్టియో ఏదో ఒకటి ప్రారంభమవుతుంది. ఈ సంకల్పములు హస్తములో ప్రవేశించినప్పుడు చెడ్డకర్మలు లేక మంచికర్మలో ఆచరిస్తాడు. పాదములలో ప్రవేశించినప్పుడు దుస్సంగమునో లేక సత్సంగమునో చేరుతుంటాడు. కనుక మానవుని యొక్క మంచి చెడ్డలకు ఈ సంకల్పములే మూలాధారము. ఈనాటి మానవుడు భగవంతుని ఆశిస్తున్నాడు. భగవంతుని స్మరిస్తున్నాడు. భగవంతుని చింతిస్తున్నాడు. కానీ ఇంత మాత్రము చేతనే భగవంతుడు తనకు లభ్యము కాడు. భగవంతుని స్మరించనంత

srisathyasaivachanamrutam

మాత్రమున భగవంతుడు అంత సులభప్రసన్నుడు కాడు. భగవంతునికి సంపూర్ణ అర్పితము కావాలి. ఈ అర్పితమైనప్పుడే తాను భగవంతుడు ఏకమై పోతారు.

**ఏకం సత్ విప్రా బహుధా వదంతి.**

ఈ ఏకత్వమునే అనేకత్వముగా విభజించి పండితులు వివిధ నామములతో ఉచ్ఛరిస్తుంటారు. దైవముతో ఏకము కావలెనన్న ఏవిధమైన సాధనలు సల్పాలి. మనకు దగ్గరలోనే బొగ్గు ఉన్నది. అగ్ని ఉన్నది. కానీ అగ్గి ఒకచోటు, బొగ్గు ఒకచోటు ఉన్నప్పుడు ఈ అగ్ని బొగ్గులో ప్రవేశించదు. బొగ్గును అగ్గిని సమీపముగా ఉంచి కొంత గాలి వీచినప్పుడే ఈ బొగ్గు కూడా అగ్నిగా మారిపోతుంది. దీనినే "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అన్నారు. ఏ సమీత్వము చేత ఆ సమీప స్వరూపాన్ని పొందుతుందో అదియే నిజమైన ఏకత్వము. మనము భుజించిన ఆహారము, లోపల జీర్ణమై దేహము సర్వత్రా ఆ స్వరూపమును అందింపచేస్తుంది. అప్పుడు ఈ భుజించిన ఆహారము, మన దేహము రెండు ఒక్కటైపోతాయి. అదేవిధముగా భగవంతునికి మనం అర్పితము కావాలి. జీవిత సంకల్పములన్నీ భగవంత్సంకల్పములుగా మారిపోవాలి. భగవద్భావము చేత ఈ సంకల్పములు పవిత్రమై, నిత్యమై, సత్యమై ఉంటాయి. ఇట్టి ఏకత్వాన్ని మనం పొందవలెనన్న ఈ దివ్యత్వముతో మన మానవత్వము ఐక్యము గావించాలి. భగవంతుడు నారాయణుడు. జీవుడు నరుడు. ఈ రెండింటియొక్క ఏకత్వముచేత నరనారాయణుల స్వరూపము పొందుతున్నాది. నర అనగా ఆత్మతత్త్వమే. ఆత్మస్వరూపమే. కనుక నరుడు అనగా కేవలం మానవాకారము ధరించినంత మాత్రమున మానవుడు కాడు. ఆకారము మాత్రమే మానవత్వము గానీ ఆత్మ స్వరూపమే. దేహమునందు నఖ శిఖ పర్యంతము ఆత్మయే సంచరిస్తున్నాది. ఏ పని చేసినా, ఏ సంకల్పములు సంకల్పించినా, ఏ మాట చెప్పినా, ఏ కార్యములో ప్రవేశించినా అంతయు ఆత్మతత్త్వముగానే రూపొందుతుంది. కనుక మనము దైవచింతన చేసినంత మాత్రమున చాలదు. దైవానికి అర్పితము కావాలి. అందువల్లనే మమైవాంశో జీవలోకే జీవభూత సనాతనః. మానవుడు అంశము, భగవంతుడు బింబము. బింబ ప్రతిబింబముల ఏకత్వమే సాధన యొక్క స్వరూపము. కేవలం పాదుకలు పూజించినంత మాత్రమున, నామము స్మరించినంత మాత్రమున,

srisathyasaivachanamrutam

ఆకారము చింతించినంత మాత్రమున చాలదు. ఇవి ప్రాకృతమైన పనులు. యివి ప్రవృత్తి లక్షణములు. భౌతికము యొక్క చర్యలు. కానీ నివృత్తి మార్గములో మనం ప్రవేశించాలి. అప్పుడే దీని ఏకత్వము మనకు అర్థమవుతుంది. ప్రవృత్తి మార్గమందు మనం ప్రవేశించి, కేవలం ఆ నివృత్తి లక్షణాలను మనం మర్చిపోతున్నాం. ఉదయం శాస్త్రులవారు గాయత్రీ మంత్రము చెబుతూ గాయత్రి పంచముఖి అన్నారు. ఏమిటి ఈ 5 ముఖములు? అందులో శబ్దబ్రహ్మము 'ఓం' మొదటి ముఖము. 'భూర్భువసువః' రెండవ ముఖము. 'తత్సవితుర్వరేణ్యం' మూడవ ముఖము. 'భర్గో దేవస్య ధీమహి' నాల్గవ ముఖము. 'ధీయో యోనః ప్రచోదయాత్' ఐదవ ముఖము. ఈ పంచముఖి దివ్యత్వాన్ని మనం ఏవిధంగా ఆరాధన చేస్తున్నాము. గాయత్రి అనగా ఏమిటి? గాయత్రి ఛాంధసాం మాతా. అన్ని వేదములకు మాతృస్వరూపిణి. ఈ గాయత్రికి 3 పేర్లు ఉంట్నువి. గాయత్రి, సావిత్రి, సరస్వతి. గాయత్రి అనగా మన ఇంద్రియములకు అధిపతి అయినది. సావిత్రి ప్రాణములకు అధిపతి, ఆధారమైనది. సావిత్రి తన పతియైన సత్యవంతుని బ్రతికించుకొంది. సరస్వతి. వాగ్దేవతా స్వరూపిణి. వాగ్దేవతా స్వరూపిణియైన సరస్వతి, సత్యదేవతా సర్వరూపిణియైన ప్రాణతత్వము, ఇంద్రియ తత్వములతో కూడిన గాయత్రి ఈ మూడింటి ఏకత్వమే నిజమైన త్రిమూర్తి స్వరూపము.

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాప సంహారం ఏకబిల్వం శివార్పణమ్.**

ఈ మూడింటి ఏకత్వమును భగవంతునికి అర్పించాలి. ఇట్టి ఏకత్వమునకు తగిన కృషి చేయాలిగానీ, భిన్నత్వములో నైతికమైన జీవితాన్ని మనం మరచి భౌతికమైన జీవితాన్ని ఆధారం చేసుకుని బ్రతుకుతున్నాం. భూర్భువస్సువః. ఈ మూడింటి అర్థము మనం మొట్టమొదట గుర్తించాలి. భూలోకము, భువర్లోకము, స్వర్గ లోకమని భావిస్తున్నారు. ఈ మూడు లోకములు ఎక్కడుంటున్నాయి? ఈ మూడు లోకములు ఒక్క మానవునియందే ఉంటున్నాయి. ప్రతి జీవియందు ఉంటున్నాయి. ప్రతిప్రాణియందు ఉంటున్నాయి. ఈ సత్యాన్ని మనం గుర్తించు కొనలేక, భూలోకము వేరు, భువర్లోకము వేరు, స్వర్గలోకము వేరని భావిస్తున్నాము. ఈ భూలోకము కేవలము మెటీరియల్. అనగా పదార్థముల యొక్క

చేరికయే. ఈ ప్రపంచమంతయు పదార్థముల యొక్క చేరికయే. దృశ్య కల్పితమైన ప్రపంచమంతయు పదార్థముల చేరికయే. కానీ ఈ పదార్థముల కదలిక ఏరీతిగా జరుగుతున్నది? భూర్ - యిదియే పదార్థముల యొక్క కదలిక Materialisation. భువః - అదే కదలిక శక్తి vibration. కదులుతున్నది గానీ, పదార్థముల కదలికకు అర్థము ఏమిటి? ఎందుకోసం కదలుతున్నది అనే దానిని అర్థం చేసుకొనుటకు కొంత ప్రయత్నం చేయాలి. అదియే సువః radiation. "భూర్భువస్సువః" అనగా Materialisation, vibration, radiation. దానినే వేదమందు "ప్రజ్ఞానం బ్రహ్మ" అన్నారు. అదే constant integrated awareness. ఇలాంటి తెలివితేటలు మానవుని యందున్నాయి. ఇలాంటి ప్రజ్ఞానం మానవునియందుంటున్నాది. ఇలాంటి vibration మానవుని యందున్నాది. ఈ మానవుని దేహమందు సర్వ పదార్థములు యిమిడి ఉన్నాయి పంచ భూతములు లేని ప్రపంచము ఎక్కడా కానరాదు. ఈ పంచభూతములకు ఎవరు మూలాధారము? అదియే ఓంకారనాదము. దీనిని పురస్కరించుకొనియే ఆనాటి గోపికలు క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీ జనవల్లభాయ స్వాహా అన్నారు. క్లీం-పృథ్వి, కృష్ణాయ-జలము, గోవిందాయ- అగ్ని, గోపీజనవల్లభాయ-వాయువు, స్వాహా-ఆకాశము. ఈ పంచ భూతములు లేని ప్రపంచము మనకు కానరాదు. సర్వజీవులందు సర్వత్రా వ్యాపించినది పంచ భూతములే. ఈ ప్రపంచమునకు ప్రాణమే పంచభూతములు. సర్వత్రా చేరినవి పంచభూతములు. దీనినే

**సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం**
**సర్వతః శృతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి.**

సర్వత్రా నిండిన తత్వము పంచభూతములే. ఈ పంచభూతములనగా భగవత్స్వరూపములే. పృథ్వీ భగవత్స్వరూపమే. కనుక భక్తులందరు భూమాత అని పిలుస్తున్నారు. భూదేవీ అని పిలుస్తున్నారు. రెండవది జలము. గంగాదేవి అంటున్నారు. గంగను కూడా దేవునిగా భావిస్తూ వచ్చారు. మన ప్రాచీనుల వైశిష్టత, వైభోగము ఎవ్వరూ అర్థం చేసుకొనలేరు. మన ప్రాచీనులందరు అనుభవించి, ఆనందించి, అందించిన దివ్యసూక్తులు. మూడవది అగ్ని దేవుడు. నాల్గవది గాలి దేవుడు. ఇవన్నీ అయిదవదైన ఆకాశమునకు మూలాధారమైనవి. ఈ పంచ భూతములు పంచ దైవ స్వరూపములే.



srisathyasaivahini.org

దైవస్వరూపమనగా మనం ఎక్కడో వెతుక్కోనక్కర లేదు. దైవము నీ హృదయవాసి. కనుక భగవంతుని హృదయవాసి అంటుంటారు. ఎక్కడ నుండి వచ్చావయ్యా అంటే ఏదో పెద్ద హోటలునుండి వచ్చాననో, లేక యింటినుండి వచ్చాననో లేక యింకే విధమైన స్థలమునుండి వచ్చాననో మనం చెబుతూ ఉంటాం. నీవు ఎక్కడ నుండో వచ్చినవాడు కాదు. నీ స్థానము హృదయమే. నీ నివాసము హృదయమే. నీవు వచ్చేది ఎక్కడ, పోయేది ఎక్కడ? దైవము కూడా ఎక్కడనుండి రాడు, ఎక్కడకు పోడు, ఉన్నచోటనుండే ఉంటున్నాడు. కానీ అనుగ్రహించే నిమిత్తము అక్కడ వారికి కనుపించవచ్చును. అమెరికాలో ఒక భక్తునికి కనిపించినంత మాత్రమున అమెరికాకు వెళ్లినాడని చెప్పటానికి వీలుకాదు. అక్కడ కూడా ఉన్నాడు. ఆ భక్తి ప్రపత్తుల ప్రభావమే ఈ సందర్శనములకు మూలకారణము. కనుక దివ్యత్వము ఎక్కడ నుంచో వచ్చేది గానీ, ఎక్కడికో వెళ్ళేది కానీ కాదు. ఎక్కడ చూచినా ఉన్నది దివ్యత్వమే. విశ్వం విష్ణుస్వరూపం. సర్వంఖల్విదం బ్రహ్మ. అన్ని రూపములు దైవ స్వరూపములే. అన్ని స్థానములు దైవస్థానములే. దైవము లేని స్థానముగానీ, దైవము కాని నామము కానీ, దైవము కాని రూపము కానీ లేదు. అన్ని రూపములు తనవే. అన్ని నామములు తనవే. "ఏకప్రభూకా అనేకనాం" అన్నారు. కనుక మన పేర్లను పురస్కరించుకొని, రూపాలను పురస్కరించుకొని, దైవము వేరువేరుగా ఉన్నాడని భావించరాదు. మేము దాసులము, దైవము దేవుడు అనే భావము మనయందుండరాదు. జీవుడు దేవుడు ఒక్కడే. నరుడు నారాయణుడు ఒక్కడే. బింబ ప్రతిబింబములు రెండూ ఒక్కటే. ఇట్టి ఏకత్వములో మనం కొంతవరకు సాధనలు సల్పి దివ్యత్వమును మనం గుర్తించుటకు ప్రయత్నించాలి. పుట్టింది మొదలుకొని గిట్టునంతవరకు దైవత్వములోనే ప్రయాణం చేస్తుంటే ఏనాడు మనం అద్వైతము అనుభవించేది? ఈ ద్వైతములో ఉండినంతవరకు మనకు రెండు దృష్టులు తప్పునవి కాదు. A man with dual mind is half blind. మనం అర్థము blind గా తిరుగుతున్నాము. మన జీవితము అర్ధ జీవితము blind గా ఉంటున్నది. కాదు కాదు. ఎప్పుడు ఒకే దివ్యత్వము మనము అనుభవించాలి. ఇట్టి ఏకత్వము గుర్తించుటకు తగిన కృషి చేయాలి. అభిషేకము సలిపే సమయంలో పండితులవారు, పాలతో, పెరుగుతో, తేనెతో అభిషేకం చేస్తున్నారు, ఒక్కొక్క దానికి



sri sathyasai vachanamrutam

ఒక్కొక్క అర్థమని తెలిపారు. సర్వసాధనలు చిత్తశుద్ధికోసం చేస్తున్నాం. చిత్తస్యశుద్ధియే కర్మః . మన సర్వకర్మలు చిత్తశుద్ధిని గావిస్తాయి. చిత్తశుద్ధి కలిగినంత మాత్రమున దివ్యత్వము మనకు లభ్యము కాదు. చిత్తశుద్ధితో దైవత్వమునకు మనం అర్పితము గావించుకోవాలి. మనం ఒక పుష్పము భగవంతునికి అర్పితం చేస్తున్నామంటే అది చాలా వాడిపోయి, కుళ్లిపోయి, పనికి రాని పుష్పమును మనము చేయము. అప్పటికప్పుడు చెట్టునుండి కోసినా దానిలోని పురుగులను తీసి పరిశుద్ధపరచి చక్కగా చేసి భగవంతునికి అర్పితం చేస్తున్నాం. చిత్తశుద్ధి కలిగినంత మాత్రమున చాలదు. చిత్తశుద్ధి అయిన హృదయాన్ని భగవంతునికి అర్పితము చేయాలి. అర్పితము, అర్పితము. అర్చన కాదు అర్పితము కావాలి. అర్చనకు, అర్పితమునకు చాలా వ్యత్యాసము ఉన్నాది. ఈ సత్సంగమువల్ల జరిగే ప్రాప్తి. సత్-దివ్యత్వమునకు సరియైన పేరు. ఎప్పటికి మార్పు చెందనిదే సత్. ఎప్పటికి శాశ్వతమైనదే సత్. అట్టి సత్‌ను మనం పొందాలి. ఎక్కడ పొందాలి? మనయందే మనం తెలుసుకోవాలి. 'సత్' అనే తత్వము మనం చక్కగా అర్థం చేసుకోవాలి. ఆ సత్సంగములో మనం ప్రవేశించాలి. పొద్దున పండితులవారు చెప్పారు 'పాలలో నీరు చేరినాయి. నీరు లేక పాలు లేకుండా లేవు. కానీ నీరు పాలతో చేరటం వలన పాలు ఎంతనో ఆనందమును అనుభవిస్తాయి. నీరు, పాలు రెండూ సత్సంగము. అదియే సరైన స్నేహము. అట్టి శాశ్వత స్నేహాన్ని నిరంతరము కాపాడుకుంటూ రావాలి. కానీ ఈ స్నేహము ఏవిధంగా ఉంటుందో మీరు ఒకసారి అర్థము చేసుకోవాలి. పాలను స్టౌపై పెట్టి కాగించినప్పుడు అందులో నీరంతా ఆవిరైపోతుంది. ఆ నీరు తనను విడిచిపోయింది కదా అని పాలు భరించుకొనలేక తన జీవితాన్ని అగ్నిలో వేయటానికి సిద్ధమవుతుంది. పాలనుంచి నీరు వేరైన తక్షణమే పాలు పొంగి పొయిలో పడిపోతాయి. నాకు స్నేహితుడు లేని జీవితము అక్కరలేదు అనుకుంటుంది. ఈ seperation కు తానే మాత్రము సంతోషించదు. తక్షణమే నీరు తీసుకుని ఆ పాలపై వేసినప్పుడు అది చల్లారిపోతుంది. ఎడబాటు కల్గిన స్నేహితునితో తిరిగి సంబంధము కల్గింది అని ఆనందిస్తుంది. ఇదియే నిజమైన నరనారాయణుల సంబంధము. బింబ ప్రతిబింబముల యొక్క సంబంధము. జీవుడు, దేవుని యొక్క సంబంధము. జీవుడు దేవునితో కూడినప్పుడు దేవుడు ఎంతనో ఆనందముతో ఉంటాడు. కానీ ఈ ప్రాకృతమైన

srisathyasaivahini.org

విషయ వాసనలలో మునిగి, ప్రపంచ సంబంధమైన ఆనందములో మునిగి, ఈ ప్రవృత్తి లక్షణమును ఆశించి, ఈ దృశ్యకల్పితమైన జగత్తులో పడిపోవటంచేత దైవము కూడా చాలా బాధపడతాడు. అయ్యో నన్ను వదలిపోయినాడా ఈ జీవుడు. అందువల్లనే అట్టి భగవంతునికి ఎట్టి విచారము చేయకుండా ఉండటం కోసమే తిరిగి అర్పితము చేస్తే దైవము ఆనందంగా ఉంటాడు. బొగ్గు అజ్ఞానము, అగ్ని జ్ఞానము, జ్ఞానా జ్ఞానములు రెండు చేరటమే కాకుండా దైవప్రేమ అనే గాలి కూడా వీచిందంటే జీవుడు, దైవము ఒక్కటైపోతారు. ఈ జీవుడు, దేవుడు ఒక్కటైపోతాడు. బింబ ప్రతిబింబములు రెండూ ఏకమైపోతాయి. కనుకనే "మమైవాంశో జీవలోకే జీవభూత సనాతనః". అనాది కాలమునుండి నా యొక్క అంశమే ఈ జీవులు అంటున్నాడు భగవంతుడు. కానీ ఈ కలియుగ ప్రభావము చేత జీవుడు వేరుగా, దేవుడు వేరుగా కనిపిస్తున్నారు. ఏ యుగమైనా యిట్టి ఎడబాటు జరగకూడదు. జీవుడు బాధపడటం లేదుగానీ దేవుడు బాధపడుతుంటాడు. దేవునికి బాధ ఏమాత్రం లేదు కానీ తనయొక్క మిత్రుడు తనకు దూరమౌతున్నాడని బాధపడతాడు. ఈ జగత్తులో మనకు శాశ్వతమైన మిత్రులు భగవంతుడొక్కడే. ఈ లౌకికమైన మిత్రులందరు కూడను hello, hello, how are you? Good bye, good bye. ఇతడు hello అనడు, how are you అనడు, good bye చెప్పడు. కానీ భగవంతునితో చేరితే తను ఆనందమే, భగవంతునికి ఆనందమే. కానీ ఎడబాటు జరిగినప్పుడు భగవంతుడు చెప్పడు గానీ బాధపడుతుంటాడు. ఎందుకీ జీవుడు ఈవిధమైన పెడమార్గము పడుతున్నాడు, ఎందుకీ సత్యాన్ని మర్చిపోతున్నాడు. దివ్యత్వానికి దూరమౌ తున్నాడు, పవిత్రతను కోల్పోతున్నాడు. అని తాను చాలా బాధపడుతున్నాడు. ఇది కూడా భగవంతుని నిమిత్తము కాదు. భక్తుని నిమిత్తమే. ఏది చేసినా ఏది చూచినా ఏది చెప్పినా నీ కోసమనే. కనుకనే ఈ seperation అనేది జీవత్వానికి భరించుకోలేనిది. రాముడు, లక్ష్మణుడు, సీత తండ్రి ఆజ్ఞ పురస్కరించుకొని అరణ్యానికి వెళ్లారు. కానీ దారంతా నడచి ఎండకన్నెరుగని సీత అలసిపోయింది. చిత్రకూట పర్వతము పైకి పోయారు. ఒక చెట్టుక్రింద కూర్చుని, రాముడు చెప్పాడు. 'లక్ష్మణా! ఒక పర్ణశాల నిర్మించు నాయనా' అని. 'ఎక్కడ స్వామి!' అడిగాడు. 'నీకు ఎక్కడ యిష్టమో అక్కడ నిర్మించు అన్నాడు. ఈ కఠినమైన

srisathyasaivahini.org

వాక్కు తాను భరించుకోలేకపోయాడు లక్ష్మణుడు. నా ఇష్టము నాకు వేరుగా ఉందా? నీ ఇష్టమే నా యిష్టము. నాకు ప్రత్యేకమైన ఇష్టము లేదు. నేనేమి తప్పు చేశాను. నీకు యిష్టమైన చోట నిర్మించమంటున్నావు' అని రామా! అని తల పట్టుకుని కూర్చున్నాడు. ఈ దుఃఖాన్ని చూచింది సీత. 'లక్ష్మణా! ఎందుకు నీవింత విలపిస్తున్నావు? మీ అన్నగారు ఏమన్నారు? ఏమి తిట్టలేదు, కొట్టలేదు కదా! నీవు ఇంత విలపించటానికి మూలకారణం ఏమిటి?' తల్లీ! కొట్టినా నాకు సంతోషమే. తిట్టినా నాకు సంతోషమే. కానీ ఎడబాటు సహించలేను. రాముని ఇష్టమే నా ఇష్టము. కనుక నా యిష్టము అని చెప్పాడు. ఇంతకంటే ఎడబాటు నాకేమి కావాలి. ఈ ఎడబాటు యొక్క శోకాన్ని నేను భరించుకోలేను' అన్నాడు. చూశారా! ఇలాంటి ఏకత్వముతో ఉండిన దివ్యత్వము ఇంత గాఢంగా ఉంటుంది. దైవానికి ఒక క్షణము దూరము కాకూడదు. దైవ భావములకు మీ భావములు విరుద్ధముగా ఉండకూడదు. దైవ సంకల్పములకు మీ సంకల్పములు వేరుగా ఉండకూడదు. ఏకంగా ఉండాలి. ఈ జగత్తు నేడు ఉండవచ్చు రేపు పోవచ్చును. ఇవంతా కదలిపోయే మేఘములే. కానీ బింబ ప్రతి బింబములైన నరనారాయణుల సంబంధము కదలనిది. శాశ్వతమైనది. సత్యమైనది. నిత్యమైనది. దీనిని వేదము చెబుతూ వచ్చింది.

**నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం**
**నిత్యశుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం**

సర్వవేదములకు మూలాధారమైన మాతృదేవియే గాయత్రి. గాయత్రీ చంధసాం మాతా! చంధస్సుకు తల్లి గాయత్రి. ఇందులో గాయత్రికి మూడు రకములైన ప్రార్థనలు చేస్తారు. ఒకటి వర్ణన, రెండవది ప్రార్థన, మూడవది ధ్యానం. ఈ మూడింటి ఏకత్వము యింతవరకు మనం విచారించాలి. 9 రకములైన వర్ణనలు చేస్తారు గాయత్రిని. ఓం భూర్ భువః సువః తత్‌సవితుర్ వరేణ్యం భర్గోదేవస్య యిది వర్ణన. ధీమహి యిదియే ధ్యానము. ధీయో యోనః ప్రచోదయాత్ ప్రార్థన. నా యొక్క బుద్ధిని నిర్మలమైనదిగా, పవిత్రమైనదిగా, నిశ్చలమైనదిగా, నిస్వార్థమైనదిగా నాకు అనుగ్రహించమని కోరుతున్నారు. వర్ణన, ప్రార్థన, ధ్యానం మొట్టమొదట మనం దైవాన్ని వర్ణించాలి. ఏవిధమైన వర్ణన కావాలి. ఓ భగవంతుడా! నీవు ఇంతటి వాడు, అంతటి వాడని. అంత వర్ణించకూడదు. నీవు నా వాడు

sri sathyasai vahanamrutam

అనే హక్కుతో మనం భగవంతుని వర్ణించాలి. మన ఇంటిలో చిన్న బిడ్డ ఉంటాడు. వాడు స్కూలుకి పోతుంటాడు. అతను వచ్చి "నాన్నా! నీకు ఇన్ని కార్లున్నాయి. ఇంత జీతము వస్తుంది. నాకు ఒక బుష్ కోటు కుట్టించు" అన్నాడు. అక్కడ ఆవిధమైన వర్ణన పనికిరాదు. ఒక విధమైన హక్కుతో నీకు కారుందో ఏమో, నీకు ఎంత జీతము వస్తుందో ఏమో నాకు తెలీదు నాకు బుష్ కోటు కుట్టించు. అదియే భగవంతునిపై భక్తుని యొక్క హక్కు. భగవంతుని ఓ అనుగ్రహస్వరూపుడా! అఖండ స్వరూపుడా! విశాల స్వరూపుడా! కరుణా స్వరూపుడా! ప్రేమ స్వరూపుడా! ఈవిధంగా వర్ణించనక్కర్లేదు. నా అభీష్టం మాత్రం నెరవేర్చాలి. ఇది తప్పింది కాదు. దైవమును అంతటి హక్కుతో అడగటానికి సిద్ధంగా ఉండాలి. భగవంతుని అడగకపోతే మరి ఎవరిని అడగాలి. సర్వహక్కులు భక్తునికి ఉన్నాయి భగవంతునిపై. అందువల్లనే నేను పూర్వము చెప్పాను. మన హృదయం ఆత్మ నుండి పుట్టినది. హృదయము ఆత్మకు కుమారుడు. ఈ హృదయమునకు కుమారుడు మైండు. మైండు ఆత్మకు grand son. ఈ mind నుండి వాక్కు అనే great grandson. వాక్కుముని మనుమడు. మైండు మనుమడు. హృదయము కుమారుడు. ఎవరికి ఆత్మకే. ఆత్మ యొక్క సంబంధమే ఈ కుమారుడు, మనువడు, మునిమనువడు. ఒక కుటుంబీకులే. కనుక మన వాక్కు దైవము నుండి వేరు కాకూడదు. మన మనస్సు దైవమునుండి వేరు కాకూడదు. మన అందరికి భాగమునిచ్చేది ఆ ప్రాపర్టీయే. Great grand father ప్రోపర్టీయే great grand son కి వస్తుంది. Grand son కు కూడా ఆ ప్రాపర్టీయే వస్తుంది. Son కి father ప్రోపర్టీ వస్తుంది. దీనిని పురస్కరించుకొనియే బైబిలునందు I am the messenger of God అన్నాడు. శారీరక సంబంధమైనది కనుక messenger గా పెట్టాడు. మానసికంగా చూచినప్పుడు I am the son of God అన్నాడు. తరువాత ఆత్మ భావముచేత I and my father are one అన్నాడు. మన దేహాభిమానం లోపల జీవుడు, దేవుడు అని భేదము పెట్టుకోవచ్చును. మానసికాభిమానం చేత నీ అంశమే నేను. ఆత్మ సంబంధము చేత నేను నీవే, నీవు నేనే. కనుక ఏకత్వమునకు మనం ప్రయత్నం చేయాలి. కేవలం దేహాభిమానం చేత మనం దైవత్వాన్ని దూరం చేసుకుంటున్నాం. ఇది మనకు సరైన మార్గము కాదు. ఎన్ని సాధనలు చేసినప్పటికి సరియైన సంబంధమే గుర్తించుకొనకుండిన ఏనాటికైనా మనం

srisathyasaivachanamrutam

ఒక్కటి కాము. ఈ సత్యాన్ని గుర్తించి నప్పుడు ఎక్కడికి పోయినా మనం ఒక్కటే. నీ కుమారుడు అమెరికాలో చదువుతుండినా నీవు ధనమును అక్కడకు మనిఆర్డరు చేస్తావు. అక్కడ అమెరికాలో ఉంటున్నాడు. నీవు ఇండియాలో ఉన్నావు. యిద్దరికి సంబంధము హృదయ సంబంధమే. ఈ సంబంధము మనం పెట్టుకోవాలి. నీవు ఎక్కడైనా ఉండు. ఏ పనైనా చేయి. ఏవిధమైన మార్గములోనైనా ప్రవేశించు. నా ఆత్మ సంబంధము ఒక్కటే. నా దైవము ఒక్కడే. నా దైవమే నా సంబంధము. దేహానికి ప్రాకృతమైన సంబంధములే గానీ ఆధ్యాత్మిక సంబంధము కాదు. ఒక ఇంటి యజమాని ఉంటాడు ఆ master ఒక్కడే. భార్య వస్తుంది. ఏమండి అని పలుకరిస్తుంది. కుమారుడు నాన్నా అని పిలుస్తాడు. కోడలు మామా అని పిలుస్తుంది. మనుమడు తాతా అని పిలుస్తాడు. భార్య ఏమండి అని పిల్చినా, కుమారుడు తండ్రీ అని పిల్చినా, కోడలు మామా అని పిల్చినా, మనుమడు తాతా అని పిల్చినా యజమానుడు ఒక్కడే. దేహసంబంధములు పురస్కరించుకొనియే ఈ సంబంధములు ప్రవేశిస్తున్నాయి. దేహముచేత ఇన్ని భేదములు ఏర్పడుతున్నాయి. దేహ సంబంధము మనకు ఏనాటికి శాశ్వతము కాదు.

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాలి సం**
**చలనము పొందు దుంప భవసాగర మీదగ లేని కంప అం**
**బుల పొది లెమ్ము చూడ మన మెప్పు దలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరిపాదములాశ్రయింపవే**

నీవు దేహాభిమానముతో కుళ్లిపోవద్దు. దేహాభిమానముతో అనేక బంధనలకు లోనుకావద్దు. ఈ దేహాభిమానము ఉంటుంది, పోతుంది. కాని నీ ఆత్మాభిమానం ఎప్పటికీ ఒక్కటే. అదియే సత్యము నిత్యమైనది. అట్టి సత్యనిత్యమైన సంబంధము మనం కల్పించుకునే నిమిత్తమై యిన్ని రకములైన సాధనలు చేయాలి.

**శ్రవణం కీర్తనం విష్ణు స్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం స్నేహ మాత్మనివేదనం.**

ఎప్పుడు ఆత్మ నివేదన అవుతుంది. Surrender కావాలి. స్నేహమైతే ఆత్మ నివేదన

srisathyasaivahini.org

జరిగిపోతుంది. ఈ స్నేహమే ఆత్మనివేదనకు ముందు step. భగవంతునితో మనకు friendship కావాలి. Near గా మనం ఉండటానికి ప్రయత్నించాలి. తక్షణమే dearness ఆవిర్భవిస్తుంది. ఆ dearness యే గాలి. ఆ దైవప్రేమ అనే గాలి దగ్గర బొగ్గుపై పడితే అది కూడా నిప్పు మాదిరి తయారౌతుంది. కనుక ఆ ప్రేమ నిమిత్తమే మనం అనేక రకములైన సాధనలు సల్పుతున్నాము. సాధనే అవసరం లేదు. ఆ సంబంధము నీవు జ్ఞప్తియందుంచుకుంటే చాలు. దైవమునకు నీకు ఉండిన సంబంధము ఆత్మ సంబంధము ఒక్కటే. అదియే బ్రహ్మ, అదియే విష్ణువు, అదియే ఈశ్వరుడు.

ఈ సృష్టికి, రక్షణకు, లయమునకు వేరుగా భగవంతుడు లేడు. కనుకనే అప్పుడప్పుడు నేను చెబుతుంటాను. ఇంగ్లీషులో GOD అంటారు. Spelling ఏమిటి? GOD అంటారు. G అంటే ఏమిటి generator. పుట్టించే వాడు O - organisor రక్షణ తత్వము. ఈ generation కు organisation ఉండాలి. D - destroyer సృష్టి, స్థితి, లయములు ఒక్క God లోనే ఉంటున్నాది. అదే God. మూడు చేరి ఒక god లోనే ఉంటున్నాయి. సృష్టికి ఒకరు, రక్షణకు ఒకరు, లయమునకు యింకొకరు కారు. God సృష్టి, స్థితి, లయ కారకుడే. ఈ విధమైన తత్వాన్ని ఏకత్వంగా మనం విశ్వసించాలి. ఇదే నిజమైన అద్వైతము. ఈ అద్వైతము ఎక్కడనుంచి వచ్చింది. శంకరాచార్యులవారు చెప్పారు, రామానుజా చార్యులవారు చెప్పారు, మధ్వాచార్యులవారు చెప్పారు అని అనుకుంటున్నారు. కానీ అందరియందు దైవత్వము ఏకమై దీనిని ప్రబోధిస్తూ వచ్చింది. వీరందరు ఆచార్యులు. ఆచార్య అనగా ఆచరించి, అనుభవించి అందించేవారు. అలాంటి ఆచార్యులైన శంకరాచార్యులు ఒకానొక సమయంలో కాశీకి వెళ్లారు. స్వామీ! నా పాపములు క్షమించు అని ఈశ్వరుని ప్రార్థించాడు. ఆదిశంకరులు. ఆర్యాంబ కుమారుడు. అక్కడ వెళ్లి స్వామీ! నా పాపాలు క్షమించమని కోరాడు. ఏమి ఆ పాపములని తానే ప్రశ్నించుకున్నాడు. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహా" అని. నిన్ను వర్ణించటానికి వాక్కు లేదు. నిన్ను వర్ణించటానికి భాష లేదు. మనస్సుకు ఏమాత్రం హక్కు లేదు అని నేనే చెప్పాను. కాశీలో ప్రవేశించి

**ఈశ గిరీశ నరేశ పరేశ .... సాంబసదాశివ**

sri sathyasai vachanamrutam

**శంభో శంకర శరణం మే తవ చరణ యుగం**

అన్నాను. ఇన్ని విధాల వర్ణించటానికి వీలుకాదని, నేనే వర్ణిస్తున్నాను. ఇది పాపం కాదా! నేను తలంచినది ఒకటి, చెప్పినది మరొకటి. నీవు సర్వత్రా ఉంటున్నావు. భగవంతుడు సర్వవ్యాపకుడు. సర్వశక్తిమయుడు అని నేనే వర్ణించాను. కానీ అక్కడ నుండి నడచుకుని కాశీ క్షేత్రానికి వచ్చాను. ఇది పాపం కాదా? కాబట్టి భావం ఒకటి. క్రియ ఒకటి. ఇదీ పాపం అనగా.

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మానాం**
**మనస్యన్యత్, వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనాం**

ఈ విధమైన మంచి చెడ్డల గుర్తింపుకు ప్రజలకు నిరూపింప చేసే నిమిత్తమై ఆది శంకరుల వారు ఈవిధమైన ప్రబోధలు చేస్తూ వచ్చాడు. అద్వైతమును గురించి ప్రబోధిస్తూ వచ్చాడు. ఇంత ప్రబోధించిన శంకరుల వారే తిరిగి కట్టకడపటికి భక్తిలో ప్రవేశించాడు.

**భజగోవిందం భజగోవిందం**
**గోవిందం భజ మూఢమతే ॥భజ॥**
**సంప్రాప్తే సన్నిహితే కాలే**
**నహి నహి రక్షతి డుకృఞ్ కరణే ॥భజ॥**

ఆ భజగోవిందం దగ్గరకు వచ్చి ప్రవేశించాడు. జ్ఞాని కూడా ఒకానొక సమయంలో భక్తునిగా మారతాడు. కాబట్టి అన్నింటికంటే ఉత్తమమైన స్థానము, అధికమైన స్థానము భక్తి ఒక్కటే. భక్తి అనగా ఏమిటి? భజ్ అనే ధాతువు నుండి పుట్టినది భక్తి. అనగా అర్పితము. పరిపూర్ణ ప్రేమను అర్పితము చేయటమే భక్తి. ఇది నిజమైన భక్తి. పూజలు చేయటము, వ్రతములు చేయటము, నోములు నోచుకోటం యివన్నీ ప్రాకృతమైన మార్గాలు. ఈ ప్రవృత్తి మార్గములో మనం ప్రవేశించి, నివృత్తిలో ప్రవేశించుటకు యిది ఒక మార్గము. మొట్టమొదట ABCD అని అక్షరాలు నేర్చుకున్నాం. ఈ అక్షరాలు నేర్చుకున్న తరువాత, అక్షరాలను words గా కలుపుతున్నాము. దీనిలోపలనే God అని పెట్టారు. అక్షరముల తరువాత పదములుగాచేర్చుకున్నాము. ఈ పదములు sentence గా చేసుకోటం. There

is God అంటున్నాం. God is no where అంటారు. ఈ పదములు ఎక్కడ చేర్చాలి. God is no where. ఈ W కి no చేర్చితే God is now here. God is no where అనేదే God is now here అని మారిపోతుంది. యిది words యొక్క magic. అదే విధముగా ఈ ప్రవృత్తి మార్గములో ప్రవేశించి ఈ నోములు, వ్రతములు చేసుకుంటూ ఎక్కడికి పోవాలి. తిరిగి ఈ sentence దగ్గరకు రావాలి. ఒక్క రూపాన్ని, ఒక్క నామాన్ని స్మరిస్తూ రావాలి. తదుపరి అంతా ఒక్కటే. అన్నింటి యొక్క ఏకత్వాన్ని మనం అందుకోవాలి. యిదే నిజమైన సాధన యొక్క ఫలితము. ఇదియే సాధన యొక్క లక్ష్యము. యిదే సాధన యొక్క సారము. ఈవిధంగా మనం ఎన్ని పాదుకలు పూజ చేసినప్పటికి, ఎన్ని వ్రతములు చేసినప్పటికిని, ఎన్ని ఉత్సవాలు జరుపుతున్నప్పటికి యివన్నీ ఏకత్వాన్ని చూపించే మార్గములు. అయితే దైవము ఒక్కడే అనే సత్యము గుర్తింపు వచ్చేంతవరకు ఈ సాధనలు కొంత అవసరమే. అంతేగానీ తిరిగి అంత్యము వరకు ఈ సాధనలలో ప్రవేశించకూడదు. ప్రతి బిడ్డ కూడను పుట్టినప్పుడు కోహం కోహం అని ఏడుస్తుంది. నేనెవరు, నేనెవరు అంటుంది. బ్రతికినంతకాలం నేనెవరు నేనెవరు అని ఏడుస్తూ కూర్చుంటే ఎప్పుడు ఈ ఏడుపు తప్పిపోయేది. మరణించక పూర్వమే సోహం సోహం అని జవాబు మననుంచి రావాలి. కనుక మనము విశిష్టాద్వైతంలో ప్రవేశించాలి. విశిష్టాద్వైతము నుండి అద్వైతములో ప్రవేశించాలి. అద్వైతములో నున్నది ఏకత్వమే. ఒక్కొక్క ఆచార్యులవారు ఒక్కొక్క రకమైన మార్గము ప్రబోధించి ఈ జగత్తునకు మార్గము ప్రబోధించారు. ప్రాకృత లక్షణాలు కలిగిన మానవులు యిలాంటి జీవితములోనే ప్రవేశించాలి. కనుక భక్తులైనవారు ఎన్ని గ్రంథములో చదువుతున్నారు. ఎందరి పెద్దల వాక్యములో వింటున్నారు. ఎన్ని ప్రబోధాలకో పోతున్నారు. కానీ మనస్సు కించిత్తైనా మారటం లేదు. ఈ గ్రంథాల్లో లేదు మన గ్రంథము. ఈ బోధనలన్నీ మనకు ఆభరణములవంటివి. ఇవన్నీ అలంకారముగా కనిపిస్తున్నాయే గానీ ఆనందాన్ని అందించటం లేదు. ఆనందము లోపల ఉన్నది. ఆనందాన్ని మనం అనుభవించాలి.

**విలువలేని ఇనుప పెట్టె, పెట్టెలోని నగలు పెట్టినట్లు**
**దేహమందె ఆత్మదేవుడుండెను సుమా!**

ఆ విలువైన ఆత్మతత్వము దేహమునందే ఉంటున్నాది. ఇనుప పెట్టె చిక్కిందని సంతోషించి,

srisathyasaivachanamrutam

యినుపపెట్టెలో నున్నవి చూడకపోతే అమూల్యమైనవి వారికి లభించవు. కానీ విలువైన వస్తువులు దాచి పెట్టేది పనికిరాని ఇనుపపెట్టెలోనే. పైన కనిపించే దేహము తుచ్ఛమైనదిగా ఉంటున్నది. విలువలేని ఈ దేహము లోపల విలువైన వస్తువులంతా దాచిపెట్టాడు భగవంతుడు. తరగని ఆస్తిని మీకందిస్తున్నాడు. విలువైన ఆస్తిని దాచిపెట్టాడు నీకోసమై. కానీ మీరు దానిని అనుభవించటానికి తగిన కృషి చేయటం లేదు. ఒరే పిచ్చివాడా నీకెంత కావలసినా నా దగ్గర ఉంటున్నాది రండి. తుచ్ఛమైన కోరికలు మీరు ఎందుకు కోరుకుంటారు. మీరు కోరికలన్నీ అర్పితం చేస్తే మీకు విలువైనవి యిస్తాను. ఏ డైమండ్సు యిస్తాడో, ఎంత విలువైనది యిస్తాడో, ఎంత అద్వైతాన్ని యిస్తాడో ఆనందం కావాలి, అద్వైతానందం, సచ్చిదానందము, ప్రేమానందము, విశిష్టానందము ఆనందానికి ఒక హద్దే లేదు. పరిమితమే లేదు. ఇలాంటి పరిమితము లేని ఆనందాన్ని మీకందించటానికి సిద్ధంగా ఉంటున్నప్పుడు మీరు పరిమితమైన ఆనందాన్ని ఎందుకు కోరుకుంటారు. అల్పమైన, స్వల్పమైన విషయాల్ని మీరు కోరనక్కరలేదు. అద్భుతంగా మీరు నిల్చండి. సర్వమూ తానే అందిస్తాడు. కానీ ఆ అర్పితమునకు ఒక అర్హత కావాలి. ఒక విధమైన విశ్వాసము పెరగాలి. ఈ విశ్వాసము లేనప్పుడు అర్పితము ప్రాప్తించదు. ఎన్ని విధములైన ప్రయత్నములు చేసినప్పటికి ప్రయోజనం ఏమిటి?

ఒకానొక సమయంలో గొప్ప చదువరులుగా ఉంటారు చాలామంది. ఎన్నో గ్రంథాలనంతా చదువుతారు. ఎన్ని విషయాలో తెలుసుకుంటారు. తెలుసుకుని ప్రయోజనం ఏమిటి?

**చదువులన్నియు చదివి చాలా వివేకియై**
**మదిని తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి ఉన్నను**
**హీనుడవ గుణంబు మానలేడు**

**తరచి చదువు చదువ తర్కవాదమె గాని**
**పూర్ణ జ్ఞానమెపుడు పొందలేడు**
**చదువు చదువు చదివి చావంగనేటికి**

**చావు లేని చదువు చదవవలయు.**

అదియే "శృణ్వంతు విశ్వే అమృతస్యపుత్రః". నీవు అమృత పుత్రుడవు నాయనా. అట్టి అమృతత్వము నీవు చూచుకో. అట్టి అమరత్వము నీవు పొందు. ఆనంద స్వరూపము పొందు. ఇటాంటివి ప్రబోధిస్తుంటే ఎందుకు గుర్తించుకోటానికి ప్రయత్నించటం లేదు. కదిలిపోయే మేఘములకోసం ప్రార్థిస్తున్నారు. ఈ తుచ్ఛమైన కోరికలు కాదు ముఖ్యము. దైవము ఎక్కడనో లేదు. నీ హృదయమునందే ఉంటున్నాడు. Body is the temple of God. ఇందులోనే ఉంటున్నాడు భగవంతుడు. అట్టి సత్యానికి క్రమక్రమేణా దృష్టి మరల్చాలి. ఈవిధంగా మరల్చుకున్నప్పుడే దివ్యత్వమైన ఆత్మతత్వం మీకు అర్థమవుతుంది. ఎక్కడో ఉన్న నీరు మీ యింటికి అందిస్తున్నారంటే మునిసిపాలిటీ వారికి tax కడుతున్నారు. ఎక్కడోనున్న కరెంటును మీ యింటికి అందించినప్పుడు current tax అందిస్తున్నారు. మీ భూమిలో మీరు యిల్లు కట్టుకుంటే కూడా మునిసిపాలిటీ వారికి house tax కడుతున్నారు. భగవంతుడు ఇంత పెనుగాలిని అందిస్తున్నాడు. భగవంతుడు సూర్యుని వెలుతురుతో ప్రపంచమంతా వెలుగునిస్తున్నాడు. కుంభవర్షాన్ని కురిపిస్తున్నాడు. స్వచ్ఛమైన గాలి నిస్తున్నాడు. దీనికి మీరు ఏమి tax కడుతున్నారో ఆలోచించాలి. అంతా free గానే అందుకుంటున్నారు. దీనికి tax అనేది అర్పితము. అర్పితమే tax. భగవంతుని కట్టవలసిన tax యిదే.

**మదీయ ధనదారాది సర్వభార సమర్పితం**
**ఆత్మానం శేష భూమి రక్షమాం శరణాగతి.**

అని ఎక్కడ నుంచి వచ్చింది ఈ family. నీవు కల్పించుకున్నదేకదా. నీకు ఇష్టము వచ్చి పెండ్లి చేసుకున్నావు. తరువాత పిల్లలు పుట్టారు. కుటుంబము పెద్దదై పోయింది. ఇంక భరించుకోలేనంటే ఎవరు పెంచుకోమన్నారు దీన్నంతా? నీవే పెంచుకున్నావు గానీ భగవంతుడు పెంచలేదే. నీవు పెంచుకున్న దానిని నీవే త్రుంచుకోవాలి. నీ కష్టములంతా నీకు నీవు పెంచుకున్నవే గానీ భగవంతుడు ఇచ్చినవి కాదు. భగవంతుడు ఎప్పుడు మంచినే ఇస్తున్నాడు. కానీ ఈ మంచిని మీరు అందుకోటం లేదు.

sri sathyasai vahini amrutam

**మంచి మాట వినరు మనసిచ్చి చెప్పినా**
**చెడ్డ మాట అంటె చెవికి చేర్చు**
**ఇట్టివారు నన్ను ఎరుగంగ నేర్తురా?**
**ఎంత తెలివియున్న ఏమి ఫలము.**

చెడ్డమాటలు direct గా పోయి చేరిపోతాయి ఈ చెవి రంధ్రములలో. మంచి మాటలు దినము చెప్తుతున్నా కొంచెమైనా సోకవు అక్కడ. కనుక మనం చేయవలసింది ఏమిటి? దైవత్వానికి తగిన కృషి మనం చేయాలి. దైవాన్ని ఏవిధంగా మనం ఆనందపెట్టాలి. దైవసన్నిధికి చేరిపోవటానికి కృషి చేయాలి. సమీపత్వానికి పోవాలి. అర్పితమైన భావముతో మనం ఆరాధన చేయాలి. అదియే దైవానికి ఆనందము. దైవము కావాలని కోరరు. అది కూడా నీ నిమిత్తమే. తల్లి దగ్గర కూర్చోవాలని పోవటం కుమారుని తృప్తికోసమే. ఆ సమీపానికి పోయినప్పుడు తల్లి ప్రేమ అమితంగా చూపుతుంది. కనుక మనము దివ్యత్వము సమీపంగా పోవాలనుకున్నప్పుడు గొప్ప గొప్ప గ్రంథములు చదవటంగానీ, గొప్ప గొప్ప సాధనలు చేయటం గానీ యివన్నీ కేవలం తాత్కాలిక తృప్తి నిమిత్తమే. భౌతికమైన తృప్తి. లౌకికమైన తృప్తి, ప్రాకృతమైన తృప్తి. ప్రవృత్తి తృప్తి. నివృత్తి తృప్తి కావాలి. అదియే శాశ్వతమైన తృప్తి. అదియే నిత్యానందం, పరమానందం, యోగానందం, అద్వైతానందం, సచ్చిదానందం. అంతా అదే ఆనందము. ఇలాంటి ఆనందము నీయందే ఉన్నాది. ఎక్కడనో నీవు వెతక నక్కరలేదు. అలాంటి ఆనందము నీయందే ఉండినటువంటిది నీవు ఆవిర్భవింపచేసుకోవాలి.

ప్రేమస్వరూపులారా! కర్మ ద్వారా మనం ఈ పవిత్రమైన స్థలాన్ని చేరవచ్చు. చిత్తశుద్ధి, కర్మపవిత్రత ఈ రెండింటియందు ఉండాలి. ఈ సంకల్పములు పవిత్రమైనవిగా మనం అభివృద్ధి పరచుకుంటే ఇంతకంటె మనం చేయవలసింది ఏమీ లేదు. మన సంకల్పములు పురస్కరించుకొనియే మన పనులంతా నెరవేరుతున్నాయి. ఒక చిన్న ఉదాహరణ. ఒక పోస్టు మాన్ వస్తున్నాడు. ఏమి చేస్తున్నాడు. ఎడ్రసులతో నున్న కవర్లు తీసుకుని వస్తున్నాడు. ఒక ఇంటికి ఒక కవరు ఇస్తాడు. ఇంటివారంతో ఆనందంగా నవ్వుతుంటారు. పోస్టుమాన్ ఆ ఆనందమును అందించలేదు. ఆ జాబులోని ఆనందము వారిని అంత

srisathyasaivachanamrutam

ఉల్లాసపరుస్తున్నాది. రెండవ ఇంటికి వచ్చి యింకొక కవరు యిస్తాడు. ఇంటిలోని వారంతా ఏడుస్తారు. వాడు ఎవరికి ఏడుపు అందించలేదు. ఆ జాబు లోని విషయమే వీరికి ఏడుపు అందించింది. భగవంతుడు కూడా అంతే. "కర్మాను బంధీని మనుష్యలోకే". చూచారా! సత్యాన్ని అనుసరించినప్పుడు లక్ష్మి మన వెంటనే ఉంటుంది. యింక ఈర్ష్య దుఃఖాన్ని అందిస్తుంది. ఈర్ష్య మానవునికి ఉండవలసింది కాదు. దీనిని దూరం చేసుకోవాలి. అప్పుడే మనకు సరైన శాంతి లభిస్తుంది. మనకు సాధన చేసే కొద్దీ విద్య అబ్బుతుంది. బుద్ధి కర్మానుసారంగా వస్తుంది. కర్మ సంకల్పముల చేత కూడి ఉంది. పవిత్రమైన సంకల్పములచేత కర్మలాచరిస్తే సర్వము ఆనందముగా ఉంటుంది. దుర్భావములచేత సంకల్పాన్ని కూర్చుకుంటే మనకు దుఃఖాన్నే అందిస్తుంది. అన్ని బలములుండి దైవబలము లేకపోతే ప్రయోజనం ఏమిటి? అన్ని బలముల కంటె దైవబలము చాలా గొప్పది.

**భుజ బలము, బుద్ధిబలము, దేహబలము**
**సర్వబలములుండి దైవబలము లేక దాసుడగును**
**కర్ణుడంతటి వాడు కడపటికేమయ్యె**
**చెప్పరయ్య మీరె ఒప్పుకుందు**

అన్ని బలములు ఉన్నాయి కర్ణునికి, బుద్ధి బలమున్నది. అస్త్రబలము ఉన్నాది. శాస్త్రబలమున్నది. అన్ని బలములు ఉన్నాయి గానీ దైవబలము లేకున్నాది. కట్టకడపటికి పతనమైపోయాడు. దేహబలము, బుద్ధిబలము ఉండికూడను ఏమి ప్రయోజనం. దైవబలము కావాలి. కనుక దైవప్రేమను ఆశించాలి. దైవప్రేమ మీరు పొందితిరా సర్వప్రేమలు చేకూరుతాయి. అదియే సంకల్పములు పవిత్రమైనవిగా ఉండాలి. ఈ పవిత్రమైన సంకల్పాలతో మీరు జీవితము గడిపినప్పుడు పవిత్రమైన పరతత్త్వాన్నే పొంది పోతారు. కానీ అనేక జన్మల పుణ్యఫలముచేత ఈనాడు ఇట్టి పవిత్రమైన ప్రాప్తి మీకు లభ్యమైంది. ఈ పవిత్రమైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సద్వినియోగం చేసుకున్నప్పుడే సద్గతి పొందుతారు. దుర్వినియోగం చేసుకున్నప్పుడు దుర్గతి పొందుతారు. భగవంతుడు ఎక్కడున్నాడు. ఎక్కడ చూచినా ఉన్నాడు. మొన్న చెప్పాను. వనములో ఉన్నాడు, భవనములో ఉన్నాడు. బాటలో ఉన్నాడు. రాతిలో ఉన్నాడు. ఆటలో ఉన్నాడు.

sri sathyasai vahini vacanamrutam

పాటలో ఉన్నాడు. మాటలో ఉన్నాడు. సర్వత్రా ఉన్నది భగవంతుడే. యుక్తిలో ఉన్నాడు, కుయుక్తిలో ఉన్నాడు. అన్నింటియందున్నది భగవంతుడే. ఈ భగవంతుని పొందటానికి సరైనది యుక్తిగా ఉండాలి గానీ కుయుక్తి ఉపయోగపెట్టకూడదు. ఈ యోగయుక్తిగా ఉంటుండాలి. అప్పుడే నిజమైన దివ్యత్వము పొందగలుగుతారు.

ప్రేమస్వరూపులారా! ఒక్కొక్క సంవత్సరమునకు ఈ పాదపూజల యొక్క సంఖ్య పెరుగుతున్నదని మీరు ఆనందిస్తున్నారు. ప్రవృత్తి మార్గములో ఇది సహజమైనది. కానీ నాకు యిది పెరగాలని ఆశలేదు. పాదుకలు పెరగనక్కర లేదు. పాదుకుల యొక్క భావం పెరగాలి. ఒక చిన్న ఉదాహరణ. ఈ పాద పూజలకోసం వచ్చినవారు యింకా లౌకికములోనే ప్రవేశిస్తున్నారు. భగవంతుడు ఆశించేది ఒక నిర్మలమైన ప్రేమను, నిశ్చలమైన చిత్తమును మాత్రమే అని తెలుసుకోటం లేదు. స్వామి తింటాడో ఏమోనని మురుకులు, నిప్పట్లు తట్టలంతా తెచ్చి ఆగదిలో పెట్టారు. పూర్ణచంద్ర హాలు అంతా ఈ తిండ్లతోనే చేరిపోయి ఉంటున్నది. నేను కుంభకర్ణుణ్ణి అనుకున్నారా వీరు. అన్నమైనా నేను తినను. అలాంటి పరిస్థితిలో ఈ తిండ్లు ఎందుకోసం తెచ్చారు. దీన్ని సరిచేయుటకు, పండ్లంతా వేరుచేయటానికి, ఒక పదహైదు దినములు పిల్లలను పెట్టి చేయవలసి వస్తుంది. ఈ కాలము లోపల ఈ పండ్లంతా కుళ్లిపోతాయి. ఇలాంటివి బాధ్యతగా తీసుకొని రాకండి. నాకు కావలసింది ప్రేమ. అదే హృదయ పూర్వకంగా ప్రేమిస్తే చాలు. ఇంకా కొంత మంది ఒక టవలు, ఒక bed sheet తెచ్చారు. నాకెందుకు ఇవన్నీ. ఒక వేళ మీకు తేవాలనుకుంటే bed sheet తీసుకురండి. Hospital కు యివ్వవచ్చు చక్కగా. అది కూడా స్వామి చెప్పాడని తీసుకురాకండి. నేను ఏదీ ఆశించను. ఆశించేది ఒక్కటే ఒక్కటి. అదియే నిర్మలమైన, నిశ్చలమైన, నిస్స్వార్థమైన ప్రేమ. అది నాకెక్కడా స్వార్థము లేదు. నఖశిఖ పర్యంతము స్వార్థము లేదు. ఏమీ కావాలని ఆశలేదు. ఆశ లేనప్పుడు నాకెందుకివన్నీ తెచ్చి పెట్టటం. అయితే శెట్టిగారు పరమభక్తుడు. ఈ విధమైన బాధ్యత నాకు పెట్టేస్తున్నాడు. నిన్న రథము చూపించాడు. నాకు రథాలు, గిథాలు యిష్టమే లేదు. నా రథము మీ హృదయమే. మీ పవిత్రమైన హృదయం ఉంటుండగా ఈ బంగారు రథము నాకెందుకు. ఈనాడు తిరిగి సింహాసనమని తెచ్చిపెట్టారు. నాకు ప్రశాంతి నిలయంలో పెట్టేంతవరకు చెప్పరు.



srisathyasaivachanamrutam

ఇలాంటివంతా ఏమీ తేకండి. ఇవన్నీ నాకు యిష్టము లేదు. నా కిష్టమైనది మీకు చెప్పాను కదా! అదే ప్రేమ. ఈ పదార్థాలు ఇకపైన మీరు తీసుకురాకండి. ఇదంతా 'భూర్' ప్రాకృతమైన వస్తువులే. 'సువః' నాకు కావాలి. అదే జ్ఞానతత్వము. అదే పవిత్రమైన జ్ఞానము. జ్ఞానదేవతు కైవల్యం. ఆ జ్ఞానాన్ని మీరు సంపాయించుకోండి. ఆ దివ్యత్వము మీరు అనుభవించండి. ఆ పవిత్రత మీరు పొందండి. దైవత్వాన్ని అందించండి. దానికి అర్పితమే చాలా ప్రధానమైనది. ఆ అర్పితమనగా ఏమంటే మనం తినిన ఆహారము మన దేహములో చేరి మన దేహము, ఆ పదార్థము రెండు ఎట్లా ఏకమై పోతున్నాయో అట్లనే మీ ప్రేమను నా ప్రేమతో ఏకం చేయండి. అప్పుడు రెండు ఏకమైపోయి దివ్యత్వమనే స్వరూపాన్ని పొందుతాయి. అంతా ఐకమత్యము చాలా అవసరము. పొద్దున్న పండితుల వారు చెప్పే సమయంలో ఐకమత్యం చాలా అవసరమన్నారు. తేనె గురించి చెప్పారు. ఐకమత్యము లేకపోవటంచేత దేశం కూడా భిన్నాభిన్నం అయిపోతున్నాది. అన్ని పుష్పములనుండి తీసుకు వస్తుంది తుమ్మెద. అనేక పుష్పముల నుండి తెచ్చిన తేనెను ఒక్క పుష్పము దగ్గర చేరుస్తుంది. అదియే సర్వరోగనివారిణిగా మారిపోతుంది. ఈ రోగ నివారణ గావిస్తుంది. మానసిక ఐకమత్యము చాలా అవసరం. Unity ఉండినప్పుడే మన హృదయం purity గా మారిపోతుంది. ఈ purity గా మారినప్పుడే divinity గా చేరిపోతుంది. Unity, purity, divinity సంబంధము మీరు చక్కగా గుర్తించాలి. ఈవిధంగా అనేక పర్యాయములు చెబుతున్నారు పండితులు. మీరు వింటున్నారే గానీ ఒక్కటైనా రెండైనా ఆచరణలో పెట్టటం లేదు. మనం ఒక్కటైనా practice లో పెడితే చాలు.

**అంధకారంబెల్ల హతమారునే జూడ**
**వసుధలో దీపంబు వార్త వలన**
**ఆకొన్న వానికి ఆకలి తీరునే**
**పంచభక్ష్యముల పేర్లు విన్న**
**నిరుపేదవాని పేదరికంబు పోవునే**
**విత్త ప్రభావంబు విన్నయంత**
**రోగ పీడుతుని బల్ రోగాలు పోవునా**

sri sathyasai vachanamrutam

**ఔషధ మహిమలంత విన్న**

ఎట్లా పోతుంది. కేవలం మనం భౌతికమైన దీనిలో ఉచ్ఛరించటం వలన మనకు శాంతి లభ్యము కాదు. అంధకారం పోవాలంటే చిన్న లైటైనా మనం అంటించాలి. అంతేగానీ అంటించకుండా అంధకారం పోవాలంటే పోదు. దీపమును ఎంతో వర్ణించినా చీకటి మనకు పోదు. వర్ణించనక్కరలేదు. ఆరాధించు, అర్పితము చేయి. ఈ అర్పితము చేసినప్పుడే ఏకత్వాన్ని పొందు తుంది. దీపావళి వస్తున్నాది. ఒక్క candle అంటించి అన్ని దీపాలు అంటించుకుంటావు. మొదటిది ఆధారమైన ఒకే candle. అదియే దైవత్వము. ఒక్కొక్క జ్యోతి అందించటమే జీవతత్వము. ఒక్క దైవత్వమే ఇన్ని జీవతత్వాలను రక్షిస్తున్నది, వెలిగిస్తున్నది. ఇవన్నీ జీవన జ్యోతులు. ఎన్నైనా వెలుగుతాయి. నీ ప్రేమ జ్యోతిని వెలిగించు. ఈ ప్రేమజ్యోతి కంటె ప్రకాశవంతమైనది జగత్తులో లేదు. ప్రేమ ఉందా సర్వమూ అక్కడే ఉంటున్నాది. కనుక ఈ ప్రేమతత్వాన్ని మీరు అభివృద్ధి పరచుకొని ఏ ప్రపంచ పనులు చేసినప్పటికిని అవి కూడా పారమార్థికంగా మారిపోతాయి. నీవు ఆఫీసుకుపోయి పనిచేయి. నీవు business చేయి, దోషము లేదు. నీ కుటుంబము పోషించుకోవాలి. అన్నీ చేస్తూ సర్వకర్మ భగవత్ప్రీత్యార్థంగా మీరు భావించండి. అంతా భగవత్ప్రీత్యర్థంగా చేయాలి. అదియే నిజమైన భక్తి. అంతే గానీ భౌతిక పదార్థములకు అర్పితం చేయటం కాదు. భౌతిక పదార్థములు ఏ దేవునికి అర్పితం చేయవద్దండి. ఎక్కడైనా మీరు పొండి. భగవంతునికి ఎందుకీ విధమైన వికారం అంతా చేస్తున్నారు. మీకందరికి తెలుసు. ఏదో మేము భక్తిగా ఉంటున్నామని తిరుపతికి పోతారు. పెద్ద పెద్ద కిరీటాలు పెడతారు. పెద్ద పెద్ద కవచాలు వేస్తారు. దైవత్వాన్ని వికారము చేస్తున్నాయి ఈ నగలన్నీ. Natural విగ్రహాన్ని చూచినప్పుడు ఎంత ఆనందము వస్తుంది. దానికంతా make up చేసి చేసి cup మాదిరి అవుతుంది. భగవంతునికి ఎక్కడైనా సరే మీరు jewels తీసుకుపోకండి. నీ కంటే బీదవాడా భగవంతుడు. ఎందుకు నీవు తీసుకుపోవటం. వీని బుద్ధులంతా ఈ రకంగా ఉంటున్నాయి. నీకు నేరోమైండ్ గానీ భగవంతునికి broad mind. భగవంతునిది expansion love. కానీ contraction love కాదు. భగవంతునికి నగలు అర్పితము చేయటం సంకుచితమైన భావమే. నీ jewels కోసం భగవంతుడు కాచుకోడు. ఈవిధంగా jewels భగవంతునికి

sri sathyasai vahini amrutam

అర్పితము చేసి భగవంతుని నిజమైన ఆకారాన్ని చెడుపుతున్నారు. ఇవన్నీ కాదు ముఖ్యము.

**హస్తస్య భూషణం దానం సత్యం కంఠస్య భూషణం**

**శ్రోత్రంచ భూషణం శాస్త్రం**

యిలాంటి నగలు ఉంటుండగా యింక వేరే నగలు ఎందుకు? కంఠానికి సత్యమనే jewel ఉన్నాది. హస్తానికి ధర్మము, దానము అనేది ఉన్నాది. పవిత్రమైన శ్రవణం చేస్తున్నావు చెవులతో. కంఠానికి శ్రవణమనే నెక్లెస్ వేసుకున్నావు. చేతికి దానమనే కంకణము ధరించావు. వానికంటె ఇంకేమి కావాలి. ఇవే సరైన నగలు. పెద్ద వజ్రాల కిరీటము ఆడంబరములు ఇచ్చేవారు show వారే. తీసుకునేవారు show వారే. నిజంగా యిచ్చేవాడు భక్తుడే కాదు. తీసుకునేవాడు భగవంతుడే కాదు. భగవంతుడు తీసుకోకూడదు, భక్తుడు ఇవ్వకూడదు. తీసుకోవలసింది ఏమిటి? నీ నిర్మలమైన ప్రేమ ఇవ్వాలి. నీ పవిత్రమైన త్యాగాన్ని చూడాలి. ఈ రెండింటిని తీసుకోటం యిచ్చుకోటం. Give and take అదే heart to heart. అదే love to love. సరైన మన jewels కానీ ఈ పిచ్చి పిచ్చివన్నీ తీసకునివచ్చి భగవంతుని భిక్షగానిగా మారుస్తున్నారు. భగవంతుడు bigger, but not begger. భక్తులందరు చేరి భగవంతుని begger గా మార్చేస్తున్నారు. హిందూ దేశమునుండి చాలామంది స్వాములు విదేశాలకు వెడుతుంటారు. ఎప్పుడు వారికి డబ్బు తక్కువైందో వీసాకు ప్రయత్నం చేస్తారు. అదా చేయవలసింది. భారతదేశములో కావలసినంత ప్రబోధలు చేయండి. భారతదేశంలో కావలసినంత అశాంతి ఉంటున్నాది. దీన్ని సరైన మార్గములో ప్రవేశపెట్టండి. నీ యిల్లును నీవు శుభ్రం చేయకుండా బయట దేశానికి పోయి ఏమి పరిశుభ్రం చేయగలవు. ఇదంతా begger కోసమని. ఛీ ఛీ ఇది సరైన ఆధ్యాత్మికమే కాదు. నిజమైన ఆధ్యాత్మికము heart to heart. Love to love. ఇది మనం చేయవలసిన పని. మీరు యికపై తట్టలంతా తెచ్చి పూర్ణచంద్రహాలంతా నింపేస్తున్నారు. నేను నిన్ననే శ్రీనివాస్‌కి చెప్పాను. ఎందుకీ పిచ్చి పిచ్చి ఆటలంతా ఆడుతున్నారు. తీసుకుపోండి అని చెప్పాను. వారు తినేవి నాకు తెచ్చిపెడతారు. నేను ఏదీ తినను. తినేది వినేది ఒక్కటే. మంచి మాటలు వింటాను. మీ ప్రేమను తింటాను. ఆ రెండింటిని

sri sathyasai vachanamrutam

నాకందించండి. మిగిలినవి ఏమీ మీరు తీసుకురాకండి. ఈ విషయాన్ని మీరు చక్కగా గుర్తుపెట్టుకొని ఎలా చేసుకున్నా సంతోషమే అయితే అన్నింటియందు నిర్మలమైన ప్రేమను పెట్టుకొని పనిచేయండి. ఈ భక్తితో, ప్రేమతో మీరు చిన్న సాధన చేసినా గొప్పదిగా మారిపోతుంది. రాముడు లంకకు ఎలా చేరాలి అనుకున్నప్పుడు రామ కార్యక్రమములో పాలు పంచుకున్నది అక్కడ చేరిన వానరులే. ఎవరు వానరులు. తోక ఉన్నవారు వానరులు. తోక లేకపోతే నరుడు. వా-నర. వా-వాలము. వాలము తెగకొడితే నరుడైపోతున్నాడు. హనుమంతుడు పరమ భక్తుడు. స్వామీ! మీ నామమే సముద్రాన్ని దాటించగలదు అని మొట్టమొదట రామా రామా అని సముద్రములో వేశారు రాళ్లను. హనుమంతుడు చెప్పినట్టు తేలాయి రాళ్లంతా. కానీ యిక్కడొక రాయి అక్కడొక రాయి ఉంటే ఎట్లా దాటతారు. రెండింటిని చేర్చే నామము ఏమిటో ప్రయత్న పూర్వకంగా సాధించాలి. ఒక రాయిపైన 'రా' రెండవ రాయిపైన 'మ'అని వ్రాసి నీటిలో వేసినప్పుడు రెండూ చేరుతూ వచ్చాయి. మనం సాయిరాం అనుకుని వస్తే సాయిరాం stone ఎక్కడకు పోతుందో? రా-మ విడివిడిగా రాస్తే రెండు చేరిపోతుంటాయి. ఈ యుక్తి మనం తెలుసు కోవాలి. ఆ యుక్తియే నిజమైన భక్తి. యుక్తిని యోగముగా మార్చుకున్నారు. నీవన్నీ ఏవిధంగా స్మరించాలి. శాంతంగా స్మరించాలి. పవిత్రమైన భావముతో ఉండాలి. అందరు అడుగుతుంటారు స్వామికి 73 ఏండ్లు అయింది ఎట్లా ఉన్నారని. నా రహస్యమంత మూడే మూడు 'P' లు. మొదటి 'P' Purity, రెండవ 'P' patience, 3వ 'P' perseverence. ఈ మూడు ఉండటం వల్ల నేను ఎంతకాలమైనా యిట్లానే ఉంటాను. కనుక ప్రతి ఒక్కరు ఈ మూడింటిని అనుభవించాలి. Purity ని పెంచుకోవాలి. శాంతము పెంచుకోవాలి. శాంతమే నిజమైన భక్తులకు ఆభరణము. శాంతమే లేక మన జీవితానికి ఏమి ప్రయోజనం? శాంతము మనకు కిరీటంగా ఉండాలి. భక్తుడు శాంతంగా ఉంటుండాలి. Purity ఉన్నప్పుడు patience చేరిపోతుంది. పిచ్చి పిచ్చి భావాలతో మీరు ప్రయత్నం చేయకుండా, చిన్న చిన్న కోరికలు మడచి పెట్టి ఒక్క దైవప్రేమను మాత్రమే పెంచుకుంటూ రండి. అప్పుడంతా ఏకమైపోతుంది. ఏకత్వాన్ని పెంచు కోవాలి. యిదంతా దారములు ఒక్కొటి తీసివేస్తే వేళ్లతో తుంచివేయవచ్చు. అన్నింటిని చేర్చటం వల్ల ఎంత భద్రంగా ఉంటున్నాది. ఏకత్వాన్ని మనం

పెంచాలి. ఆ ఏకత్వాన్ని పెంచినప్పుడే మనకు బలం వస్తుంది. ప్రపంచమంతా ఏకం చేసుకుని, ఆ ప్రపంచాన్నంతా భగవంతునితో ఏకత్వం చేయాలి. ఏకం సత్ విప్రా బహుధావదంతి. ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ అన్నారు. మన మాక్షర తత్వాన్ని మనం తీసుకోవాలి. ఈ సంకుచితమైన భావాలు పక్కకు పెట్టి, దివ్యమైన ఆత్మతత్వము మీరు అనుభవించండి. ఒక చిన్న ఉదాహరణ.

Dr. గాడియా చెప్పాడు. శెట్టిగారికి health, long life యివ్వండి అన్నాడు. చాలా మంచిది. అందరి క్షేమాన్ని కోరటం చాలా ఉత్తమమైన కోరిక. అది ఒకరు చెబితే వచ్చేది కాదు. ఆ శెట్టిగారి మంచి తనము వలన స్వామే తనకి అందిస్తుంటాడు. ఇది కేవలం ఒక రికమెండేషనుతో వచ్చేది కాదు. ఇది partnership business కాదు. అతని హృదయము, నా హృదయము రెండింటి ఏకత్వము కావాలి. ఈనాడు మనం ప్రత్యక్షంగా public లో చెబుతున్నాను. చిరంజీవిరావుకు వీరందరికి తెలుసును. పోయిన వారము డాక్టర్సు నుంచి జాబులు వచ్చినాయి. Allopathy డాక్టరు, Homoeo Doctors, ఆయుర్వేద డాక్టర్సు అందరు జాబులు వ్రాస్తారు. స్వామీ 10వ తేదీ యిక్కడ ఏదో function జరుపుతున్నారంటున్నారు. తక్షణమే శెట్టిగార్ని మధురకు పంపించండి. 10వ తేదీ వరకు అతను ఉండటానికి వీలు లేదు. ఈ లోపలనే అతను మరణిస్తాడని వ్రాశారు. నేను చెప్పాను అతను భక్తి, నా శక్తి రెండింటి ఏకత్వం చేత అతను తప్పక ఉండగలడు. ఎంతో ప్రీతిగా, ఆ దేహము ఎంత కృశించి పోయినప్పటికి, ఎన్ని వ్యాధులు వచ్చినా సహించుకొని, భరించుకొని ఆవిధంగా వస్తున్నాడు పాపం. ఆ భక్తియే అతన్ని రక్షిస్తుంది. దైవశక్తిని మించినది ఈ జగత్తులో మరొకటి లేదు. ఆ శక్తిని మీరు స్వాధీనం చేసుకుంటే సర్వ శక్తులూ మీ హస్తగతమై పోతాయి. అనుగ్రహబలాన్ని మీరు సంపాదించారంటే నవగ్రహాలు మిమ్మల్ని ఏమి చేయగలవు? కనుక అనుగ్రహంకోసం పాటు పడండి, అర్పితంకోసం పాటుపడండి. అదియే నిజమైన ఆనందము, నిజమైన ప్రేమ.

**(తేదీ 11-10-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam